TGTEL /2018/75056

# తెలంగాణభూమి

తెలుగు దినపత్రిక




నల్గొండ | ఆగస్టు 23 ఆదివారం 2026 | సంపుటి : 9 | సంచిక : 65 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : కొండ నరసింహస్వామి

NALGONDA | SUNDAY AUGUST 23 2026 | VOL:9 ISSUE: 65 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: Konda Narasimha swamy

# కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**లండన్, ఆగస్టు 22**

లండన్ లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కి చెందిన విద్యావేత్తలతో ఆయన సమాలోచనలు జరిపారు. తెలంగాణ రైజింగ్ అధికారిక ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వం వహించారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, కె. రామకృష్ణ రావు, జయేశ్ రంజన్ తో కలిసి హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి విద్యాసంస్థలకు ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ బృందానికి వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు భాగస్వాములు కావాలని వారు కోరారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌లో భారత ప్రభుత్వం తరపున సేవలు అందిస్తున్న ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకట సెరిష్ గండికోట, తెలంగాణతో భాగస్వామ్యం చేసుకునేందుకు ఆసక్తి చూపించారు. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, పరిశోధన, వ్యాపార ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించడం, కొత్త స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం వంటి అంశాల్లో తెలంగాణ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ కలిసి పనిచేసేందుకు ఒక ప్రత్యేక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇరు పక్షాలు ఈ సందర్భంగా అంగీకరించాయి.



## పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం



**హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం**

**జర్నలిజం కేవలం వ్యాపారం కాదు.. అదొక సామాజిక బాధ్యత**

**ఖర్గే సభ తర్వాత జరిగిన శుద్ధీకరణ గురించి ప్రశ్నించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఆగస్టు 22**

ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఐఏఎస్ ఆఫీసర్స్ క్లబ్ లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి (మిగతా 2వ పేజీలో..)

## ఆగస్టు 28నే రాఖీ పండుగ.. పండితుల స్పష్టత!

**హైదరాబాద్, ఆగస్ట్ 22**

శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం 9:08 గంటలకు ప్రారంభమై ఆగస్టు 28 ఉదయం 9:48 గంటల వరకు ఉండటంతో.. ఈ ఏడాది రాఖీ పండుగను ఆగస్టు 28న జరుపుకోవాలని పండితులు స్పష్టం చేశారు. రాఖీ కట్టడానికి ఆగస్టు 28 ఉదయం 6:23 నుంచి 9:48 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 12:14 నుంచి 1:05 గంటల వరకు (అభిజిత్ ముహూర్తం) అత్యంత (మిగతా 2వ పేజీలో..)



## నేటి అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్‌ల బంద్

**తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ**

**హైదరాబాద్, ఆగస్టు 22**

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్‌ల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. శనివారం 18 సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్, జేఏసీ కన్వీనర్ ముకేశ్‌గౌడ్, ఇతర నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు 3 హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని మండిపడ్డారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో 200 మంది డ్రైవర్లు



ఆత్మహత్య చేసుకున్నారని.. దీనికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాలన్నారు. హామీలు అమలు చేయకుండా, ఆర్టీసీలో ఈవీ ఆటోల ప్రతిపాదన తేవడం సరికాదన్నారు. ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ (మిగతా 2వ పేజీలో..)

## బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, ఆగస్ట్ 22**

బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 – సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో




## మంత్రి కొండా సురేఖపై చర్యలకు మెజారిటీ నేతల పట్టు

**రంగంలోకి అధిష్ఠానం ప్రతినిధి మీనాక్షి నటరాజన్**

**ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయ సేకరణ**

**భట్టి, మహేశ్, రవి, వేంనరేందర్‌ల మధ్య చర్చలు**

**భట్టిని కలిసేందుకు కొండా మురళి యత్నం**

**అవకాశం ఇవ్వని డిప్యూటీ**

**విచారణ సమయంలో నాపై విమర్శలేల?**

**క్రమశిక్షణ సంఘానికి కొండా సురేఖ ఘాటు లేఖ**

**హైదరాబాద్, ఆగస్టు 22**

మంత్రి కొండా సురేఖ వివాదాన్ని పరిష్కరించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం స్వయంగా రంగంలోకి దిగింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రిపైనే తీవ్ర వ్యాఖ్యలు చేసిన పరిణామం సరికాదని భావిస్తున్న అధిష్ఠానం ఈ రగడకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేనన్న అభిప్రాయంతో ఉందని ఏఐసీసీ వర్గాలు వెల్లడించాయి. వివాదానికి ముగింపు పలికే చర్యలు తీసుకోవడంతో పాటు తదుపరి కార్యాచరణ ప్రణాళిక పైనా ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దీనిపై పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల అభిప్రాయాల్ని కూడా తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. అభిప్రాయాలు తీసుకునే (మిగతా 2వ పేజీలో..)



## శేరిలింగంపల్లిలో దారుణం

**నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం కూలి ఇద్దరు కార్మికులు మృతి**

**పలువురికి గాయాలు**

**శేరిలింగంపల్లి, ఆగస్టు 22**

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని అంజయ్య నగర్ లో శనివారం ఘోరమైన ప్రమాదం జరిగింది. నిర్మాణంలో ఉన్న ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు (మిగతా 2వ పేజీలో..)



తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక



# శేరిలింగంపల్లిలో దారుణం

(మొదటి పేజీ తరువాయి)

మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. భవనం శిథిలాల నుంచి ఇద్దరి మృతదేహాలను వెలికి తీసినట్టు అధికారులు పేర్కొన్నారు. మరికొంతమందికి గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరికొందరు వ్యక్తులు, స్థానికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చునని భావిస్తున్నారు. భారీ భవనం కావడంతో.. శిథిలాలను తొలగించేందుకు సమయం పడుతుందని, రెస్క్యూ పనులకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని క్షేమంగా బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్మికులను మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేష్ కారే (34), మోహన్ (42)లుగా గుర్తించారు. వీరు టైల్స్ పనిచేస్తూ.. కొండాపూర్‌లో నివాసం ఉంటున్నారు. సిఎం సీ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీపీ రీతి రాజ్, తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, రిసిపి కమీషనర్ వెంకన్న , హైడ్రా, టౌన్ ప్లానింగ్, సీఎంసీ విభాగం అధికారులతో కలసి హుటాహుటిన సంఘటన జరిగిన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్ 15లోపు ఎశీబఅస్త్రటఅశ్రీఎఝఎవతీంఎష్ట్రుశ్రీశ్రీవఅస్త్రవఏస్త్రఝఅశ్రీ.ఒశీఎ మెయిల్ కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ. లక్ష, మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.

# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ద హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సంగీత బారోచ్, కరవన్ పత్రిక ఎడిటర్ అనంతనాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ నుంచి గౌతమ్ లహరి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారతీయ జర్నలిజం వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను ఆయన సోదాహరణంగా వివరించారు. ?వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. ?సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం రిపోర్ట్ చేయడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే... దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు.

# ఆగస్టు 28నే రాఖీ పండుగ.. పండితుల స్పష్టత!

(మొదటి పేజీ తరువాయి)

శుభప్రదమైన సమయాలు. ఈ ఏడాది భద్ర కాలం సూర్యోదయానికి ముందే ముగిసిపోవడంతో ఆగస్టు 28న రోజంతా రాఖీలు కట్టుకోవడానికి అనుకూలమైన సమయమని పండితులు వెల్లడించారు.

# నేటి అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్‌ల బంద్

(మొదటి పేజీ తరువాయి)

బోర్డును ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయాలని, ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న ఏటా రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓలా ఊబర్, ర్యాపి డో బైకులపై నిషేధం విధించాలన్నారు. 'ఆటో త్రీవీలర్ లైసెన్స్ పునరుద్ధరించాలి. గిగ్ వర్కర్స్ అగ్రిగేటర్ పాలసీని



రాష్ట్రంలో అమలు చేయాలి. ట్రాఫిక్ చలాన్లపై 80 శాతం సబ్సిడీ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.

# మంత్రి కొండా సురేఖపై చర్యలకు మెజారిటీ నేతల పట్టు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు అప్పగించింది. ఆమెతో పాటు సహాయకులు శనివారం రాష్ట్రంలోని పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తీసుకున్నారు. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాల్సిందేనని అత్యధికులు చెప్పారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. సుస్మితకు– ప్రభుత్వానికి మధ్య వైరంలా కాకుండా ముఖ్యమంత్రి– మంత్రికి, పార్టీకి–పార్టీ నేతకు మధ్య రగడలా ఈ పరిణామం రూపుదిద్దుకుందనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. "శుక్రవారం 18 మంది, శనివారం మరో 10 మందికి పైగా బాహాటంగా మంత్రిపై చర్యలు తీసుకోవాల్సిందేనని చెప్పారు. ఒక విధంగా బాణం వదిలేసినట్లే. ఇప్పుడు వెనక్కి తీసుకుంటే పార్టీలో క్రమశిక్షణ అన్న దానికి అర్థమే ఉండదు. రేపు కొండా సురేఖ మంత్రివర్గంలో కొనసాగితే ఈ 28 మంది ఎమ్మెల్యేలు ఆమె దగ్గరకు వెళ్లలేరు. ఆమె కూడా ఒక మంత్రిగా వారందరినీ కలిసే పరిస్థితి ఉండదు. దీనికి ముగింపు పలకాల్సిందే" అని మీనాక్షి నటరాజన్‌కు రాష్ట్ర పార్టీ నేతలు చెప్పినట్లు సమాచారం. "కొండా సురేఖ కూడా అమీ తుమీ అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. క్రమశిక్షణ సంఘానికి ఇచ్చిన వివరణలో తన కుమార్తె వ్యాఖ్యల పట్ల ఎలాంటి విచారాన్ని వ్యక్తం చేయకపోగా తాజాగా మళ్లీ రెండో లేఖ కూడా రాశారు. ఆ లేఖలోనూ లెక్క చేసేదేం లేదు అన్నట్లుగానే ఆమె వైఖరి ఉంది. ఈసారి అధిష్ఠానం ఉపేక్షించే పరిస్థితి ఉండదు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాన్ని అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటుంది" అని మరికొందరు ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు.

## వరుస భేటీలు...అంతర్గత చర్చలు

కొండా వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహ్హ?షకుమార్‌గౌడ్, పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిలు విడివిడిగా అనేక మందితో మాట్లాడారు. భట్టి–వేంనరేందర్‌రెడ్డిలు కూడా ఈ అంశంపై చర్చించుకున్నారని సమాచారం. శుక్రవారం 17 మంది ఎమ్మెల్యేలు విలేకరుల సమావేశం నిర్వహించి కొండా సురేఖపై వేటు వేయాలని డిమాండ్ చేయగా తాజాగా మరో 10 మంది అదే కోరారు. కొండా సురేఖ కూడా పార్టీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ మల్లు రవికి రెండో లేఖ రాశారు. విచారణ జరుగుతుండగానే ఇంతమంది ఎమ్మెల్యేలు బహిరంగంగా తనపై విమర్శలు చేయడం, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం వెనక ఉన్న అదృశ్య శక్తి ఎవరో తేల్చాలన్నారు. ఈ ఎమ్మెల్యేల అభిప్రాయాలు బహిరంగంగా వెల్లడించడం క్రమశిక్షణా సంఘం నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుందని, దానిపైనా విచారణ చేయాలని కోరారు. ఈ లేఖ వివాదానికి ఆజ్యం పోసింది. భట్టిని కలిసేందుకు కొండా మురళి సమయం అడిగినట్లు తెలుస్తోంది. భట్టి సమయం ఇవ్వలేదని సమాచారం.

## సోమవారం రాష్ట్రానికి సీఎం

సురేఖ విషయంలో ఏం చేయాలి అన్న దానిపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చిందని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే తర్వాత పరిణామాలు, మంత్రివర్గంలో చేయాల్సిన సర్దుబాట్లపై దృష్టి పెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్ వస్తున్నారు. అనంతరం ఆయనతో అధిష్ఠానం మాట్లాడనుందని సమాచారం. ఇప్పటికే ప్రాథమికంగా సీఎంతో అధిష్ఠాన ప్రతినిధులు మాట్లాడినప్పటికీ ఆయన తిరిగొచ్చాక మరింత లోతుగా చర్చిస్తారు.

# దేశంలో పెరిగిపోతున్న చక్కెర ధరలు.


న్యూఢిల్లీ : దేశంలో చక్కెర ధరలు ఇటీవలి కాలంలో భారీగా పెరిగిపోతున్నాయి. నెల రోజుల్లో దాదాపు రూ.10 వరకు పెరిగినట్లు అంచనా. అయితే, చక్కెర ధరలు పెరగడానికి ఇథనాలే కారణమనే ప్రచారం జరుగుతోంది. దీనిపై కేంద్రం స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, చక్కెర ధరల పెంపునకు, ఇథనాల్‌కు సంబంధం లేదని కేంద్ర వినియోగదారులు వ్యవహారాలు, ఆహారం, సరఫరా శాఖ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం దీనిపై ఒక ప్రకటన చేసింది. ప్రస్తుతం దేశంలో చక్కెర ధరల పెరుగుదలకు గల కారణాలను వివరించింది. చక్కెర ఉత్పత్తి తగ్గిపోవడం, పండుగల సీజన్ కావడంతో డిమాండ్ భారీగా పెరగడం, వాతావరణ సమస్యల కారణంగా పంట నష్టపోవడం, అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ కఠినంగా మారడం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని కేంద్రం చెప్పింది. ఇథనాల్ ఉత్పత్తికి, చక్కెర ధరల పెరుగుదలకు



సంబంధం లేదని స్పష్టం చేసింది. గత జూలై 20న కిలో చక్కెర ధర సగటున కేజీకి రూ.48.18 పైసలు ఉండగా, ప్రస్తుతం కేజీ ధర రూ.57.70గా ఉంది.

# ఎల్పీజీ గ్యాస్ ఈ–కేవైసీ గడువు పెంపు

న్యూఢిల్లీ : ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులకు ఊరటనిస్తూ ఈ–కేవైసీ పూర్తి చేసుకునే గడువును కేంద్రం ఆగస్టు 31 వరకు పొడిగించింది. సర్వర్ సమస్యలు, ఓటీపీ ఆలస్యం వంటి సాంకేతిక ఇబ్బందుల వల్ల కస్టమర్లు ఇబ్బంది పడటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇండేన్, భారత్, హెచ్పీ గ్యాస్ వినియోగదారులు సమీప ఏజెన్సీలో లేదా అధికారిక యాప్ల ద్వారా కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



# బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఐదురోజులపాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

**న్యూఢిల్లీ :**

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఆగస్టు 22 నుంచి 27 వరకు ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఈ అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం లేదని, అయితే ఈదురుగాలులు గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. తెలుగు రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో, రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులను అప్రమత్తం చేశారు.



# రామారావు హాస్పిటల్ ను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్

**నిజాంపేట్, ఆగస్ట్ 22 :**

ఈ రోజు రాజీవ్ గాంధీ నగర్ రోడ్డు నెంబర్ 11లో నూతనంగా ఏర్పాటు చేసిన రామారావు హాస్పిటల్ ను 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసి,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జల్లూరి రమణ,సాయిలు, శేఖర్, హాస్పిటల్ సిబ్బంది, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# కరీంనగర్ కార్పొరేషన్ పై 'జెన్--జీ వాచ్‌డాగ్' నిఘా ఏర్పాటు చేస్తాం!

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**


**కరీంనగర్ టౌన్, ఆగస్టు 22**



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. నగరంలో తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ  జెన్--జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ పనులు, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా 40 నుంచి 50 మందితో ప్రత్యేక విజిలెన్స్ వాచ్ డాగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని రాజేందర్ రావు తెలిపారు.ఈ కమిటీలో యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువతను ఎంపిక చేస్తామని చెప్పారు. వాచ్‌డాగ్ కమిటీ సభ్యుల సంప్రదింపు నంబర్లను నగరంలోని ప్రధాన చౌరస్తాల్లో హోర్డింగుల ద్వారా ప్రదర్శిస్తామని చెప్పారు.అవసరమైన హోర్డింగుల ఏర్పాటుకు తన సొంత ఖర్చుతో ముందుకు వస్తానని తెలిపారు. వెలిచాల ప్రజా కార్యాలయం ద్వారా కూడా ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.కరీంనగర్ నగరపాలక సంస్థలో గత బీఆర్ఎస్ పాలకుల కంటే ప్రస్తుతం బీజేపీ పాలకుల హయాంలో అవినీతి వ్యవహారాలు మరింత పెరిగిందని రాజేందర్‌రావు ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని,ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా అందించడంతో పాటు పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను రాజేందర్‌రావు తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సుస్మిత వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.కరీంనగర్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, నిన్న జగిత్యాల లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశానని చెప్పారు. మంత్రి సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌కు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్థాయిలో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు కొనసాగుతున్నా యని అతి త్వరలోనే 22ఏ బాధితులకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రవ్యాప్తంగా వేల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లాయని ఆరోపించారు.ఆ సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా పరిష్కరించి బాధితులకు ఉపశమనం కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్ విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివాస్ సర్పంచులు కమలాకర్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకరు జగ్గానీ కనకయ్య, ఎండి ఖాజా రావనవేని సంపత్, కాంగ్రెస్ నాయకులు గండి రాజేశ్వర్ మూల కృష్ణారెడ్డి, గసికంటి కుమార్, సముద్రాల రమణారావు, వేల్పుల వెంకటేష్ అనంతుల రమేష్ జల్లోజు శ్రీనివాస్ పత్యం రాజేష్, వేముల శ్రీనివాసు, సలీం తిప్పారపు శ్రీనివాస్, కపిల్ మాధవ్, కనకరాజు, వెలిచాల యువసేన జిల్లా అధ్యక్షుడు కాసారపు కిరణ్ కుమార్, గండి గణేష్ ఉపసర్పంచ్ కాశీపాక రాకేష్, సలీం, చిందం శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకుడు కోహెడ వేణు, మీసా రమాదేవి కర్రె పావని, పోరండ్ల రమేష్ సత్తినేని శ్రీకాంత్, 22 ఏ భూ బాధితుల ఐక్యవేదిక అధ్యక్షుడు పాషా మోహన్ రెడ్డి, రేకుర్తి మాజీ ఉపసర్పంచ్ గొల్ల కృష్ణయ్య, సుధీర్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ అయోధ్య వాసవీ సత్రం ప్రాజెక్ట్ దిగ్విజయోస్తు





**ఆశీర్వదించిన విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి**

**హైదరాబాద్, ఆగస్ట్ 22**

శ్రీ అయోధ్య వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్ట్ ప్రతిష్టాత్మకంగా అయోధ్యలో తలపెట్టిన ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సత్రం ( అయోధ్య వాసవీ సత్రం ) దిగ్విజయంగా పూర్తి చేస్తారని విశాఖ శ్రీ శారద పీఠాధిపతి షణ్మత స్థాపన ఆచార్య జగద్గురు శంకరాచార్య సంప్రదాయ శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి వారు ఆశీర్వదించారు. తమ ట్రస్ట్ తలపెట్టిన ప్రాజెక్టును ఆశీర్వదించాలని ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ హరినాథ్ గుప్త బెలిదె ఆధ్వర్యంలో చీఫ్ అడ్వైజర్, వైశ్యరత్న, డాక్టర్ మల్లికార్జున్ పసుమర్తి ,  ఆర్గనైజింగ్ సెక్రటరీ వేముల కాశీ విశ్వనాథ్ బాబు తదితరుల బృందం స్వామివారిని కలిసింది. స్వామివారు ప్రాజెక్టు వివరాలు అడిగినప్పుడు చైర్మన్ హరినాథ్ గుప్త మాట్లాడుతూ, ప్రాజెక్టును విశదీకరించారు. మహాస్వామి వారు ఆశీర్వదిస్తూ, ప్రాజెక్టు అద్భుతంగా ఉందనీ, అనుకున్న సమయానికి ప్రాజెక్టును దిగ్విజయంగా పూర్తి చేస్తారని ఆశీర్వదించారు. సంకల్పం ప్రజా శ్రేయస్సు తో ముడిపడి ఉంటే దైవానుగ్రహం పుష్కలంగా లభిస్తుందని ప్రవచించారు. అయోధ్య ప్రాజెక్టును దిగ్విజయంగా,  నిర్ణీత గడువులోగా పూర్తి చేయడానికి  దేవదేవత రాజశ్యామల అమ్మవారు అలాగే ఈశ్వర అనుగ్రహం లభిస్తాయని మహా స్వామివారు చైర్మన్ హరినాథ్ గుప్తను ప్రత్యేకంగా దీవించారు.

## "డివైన్ వేస్ట్ డ్రైవ్ -- 2026" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన

**గాజులరామారం, ఆగస్ట్ 22**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "డివైన్ వేస్ట్ డ్రైవ్ -- 2026" కార్యక్రమంలో భాగంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని చిత్తారమ్మ దేవాలయం వద్ద ఈరోజు డివైన్ వేస్ట్ కలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక పౌరుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 45 మంది పౌరులు రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వద్ద ఉన్న పాత, దెబ్బతిన్న లేదా ఉపయోగంలో లేని డివైన్ వస్తువులను అందజేశారు. మొత్తం సుమారు 0.5 టన్నుల డివైన్ వేస్ట్ సేకరించబడింది.ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం ఇస్తూనే, పాత మరియు దెబ్బతిన్న దేవతా చిత్రాలు, ఫోటో ఫ్రేములు, విగ్రహాలు తదితరాలను గౌరవప్రదంగా సేకరించి, శాస్త్రోక్తంగా ఉద్వాసన  పూజ అనంతరం గాజు, ఫ్రేములు, ఫోటోలు, పుస్తకాలు, విగ్రహాలు తదితర విభాగాలుగా వేరు చేసి, రీసైక్లింగ్‌కు పంపేందుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పౌరుల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను సేకరించి, కార్యక్రమంపై వారి అభిప్రాయాలు మరియు సూచనలను నమోదు చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం ద్వారా ప్రజల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణ, రీసైక్లింగ్ మరియు డివైన్ వస్తువుల గౌరవప్రదమైన నిర్వహణపై అవగాహన మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల డిప్యూటీ కమిషనర్, గాజులరామారం సర్కిల్, సిఎంసీ హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో  గాజులరామారం సర్కిల్  ఉప కమిషనర్ యు .వెంకట్ రాములు, సి.ఎం.సి డిప్యూటీ ఈఈ నిఖిల్ రెడ్డి , ఏ .ఈ స్వాతి గాజులరామారం సర్కిల్  శానిటేషన్ సిబ్బంది  పాల్గొన్నారు .



## రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 97 ను వెంటనే ఉపసంహరించాలి

**రంజోల్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో పట్టణం. 2 అధ్యక్షులు రమేష్ రెడ్డి**

**జహీరాబాద్, ఆగస్ట్ 22 :**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిఓ నెంబర్ 97 తీసుకోని రావడంతో పాలిటెక్నిక్ విద్యార్థులకి తీరని అన్యాయం జరుగుతుందని దానిని వెంటనే రద్దు చేయాలని జహిరాబాద్ పట్టణం. 2 అధ్యక్షులు బసంత్ పుర్ రమేష్ రెడ్డి అన్నారు. జిఓ నెం. 97 తక్షణమే రద్దు చెయ్యాలని కోరుతూ బిజెవైఏం ఆద్వర్యంలో  రంజోలు సంగమేశ్వర పాలిటెక్నిక్ కాలేజ్ విద్యారులకు మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు న్యాయం చేసే జిఓలు, చట్టాలు ఉండాలి గాని విద్యార్థులకు అన్యాయం చేసేవి కాకూడదని, జిఓ నెం. 97 వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చెప్పడతామనీ హేచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమ అనిల్, బీజేపీ పట్టణ అధ్యక్షులు రమేష్ రెడ్డి, బీజేవైఎం మాజీ అసెంబ్లీ కన్వీనర్ నరేష్ పాటిల్,  బీజేవైఎం నాయకులు అకేలేష్ యాదవ్. ప్రవీణ్ పల్లె కార్తీక్. రాజు. పాండు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా బీసీ బహుజన నాయకుడు కైరం కొండ వినోద్ కుమార్ నియామకం

**యాదగిరిగుట్ట, ఆగస్టు 10 :**



యాదాద్రి–భువనగిరి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా యాదగిరిగుట్ట మాజీ ఎంపీటీసీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన విద్యావంతుడు ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కలిగిన బహుజన నాయకుడు కైరం కొండ వినోద్ కుమార్ నియమితులయ్యారు. బీసీ సామాజిక వర్గానికి చెందినప్పటికీ, గతంలో ఎంపీటీసీగా తన పదవీ కాలంలో కులాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి, ముఖ్యంగా దళిత, గిరిజన, బీసీ, బహుజనుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పోరాడిన వ్యక్తిగా వినోద్ కుమార్ కి ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. విద్యావంతుడిగా, అన్ని వర్గాల పట్ల సామాజిక సేవా దృక్పథంతో నిబద్ధతతో పనిచేసే బీసీ నాయకుడికి ఈ పదవి దక్కడం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎంతో భరోసానిచ్చే అంశం. బీసీ – ఎస్సీ – ఎస్టీ బహుజన ఐక్యతకు ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు, దళిత, బహుజన, బీసీ సంఘాల నాయకులు, మేధావులు, యువకులు బీసీ బిడ్డ వినోద్ కుమార్ కి హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాన్ని యధావిధిగా అమలు చెయ్యాలి

**పథకంలో మార్పుల వల్ల నిరుపేదలకు అన్యాయం చేయొద్దు**

**తులం బంగారం హామీని నిలబెట్టుకోవాలి : బిఅర్ఎస్ నాయకులు షేక్ సోహైల్**

**జహీరాబాద్, ఆగస్ట్ 22 :**



పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'కళ్యాణ లక్ష్మి' మరియు 'షాదీ ముబారక్' పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తుమ్మన్ పల్లి సర్పంచ్ అంజూమ్ సోహైల్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ  ?కేసీఆర్ హయాంలో 1,00,016 (రూ. లక్షా పదహారు) సాయం అందించడన్ని జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకాలకు అరకొర నిధులు కేటాయిస్తూ వస్తోందని విమర్శించారు. చివరకు ఈ అద్భుతమైన సంక్షేమ పథకాలకు పూర్తిగా స్వస్తి పలకాలనే దురుద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ?"పేద వర్గాల ఆడబిడ్డల జీవితాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలి. కోర్టులో తగిన కౌంటర్ దాఖలు చేసి, ఈ పథకాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి పేద బిడ్డకు రూ. లక్షా పదహారు ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని షైక్ సోహైల్ కోరారు.

## జీడిమెట్ల సబ్ స్టేషన్ నుండి సూరారం  సిగ్నల్  వరకు ఉన్న రహదారి ఆక్రమణల తొలగింపు

**గాజులరామారం, ఆగస్ట్ 22 :**




సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు  గాజులరామారం సర్కిల్ పరిధిలోని  జీడిమెట్ల సబ్ స్టేషన్ నుండి సూరారం  సిగ్నల్ వరకు  ఉన్న రహదారి ఆక్రమణలను అధికారులు తొలగించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. సర్కిల్ పరిధిలో  అక్రమ కట్టడాలు కట్టినిచో అట్టి అక్రమ కట్టడాలుపై కఠిన చర్యలు తీసుకోబడునని గాజులరామారం ఉప కమిషనర్ యు . వెంకట్రాములు హెచ్చరించారు . ఈ ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు. రహదారులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

# మూడోసారి గర్భం రూమర్స్‌పై కరీనా కపూర్ ఫన్నీ రియాక్షన్!



బాలీవుడ్ నటి కరీనా కపూర్ తన మూడో ప్రెగ్నెన్సీపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలకు తనదైన శైలిలో సరదాగా స్వస్తి పలికారు. ఇటీవల ఆమెకు సంబంధించిన కొన్ని ఫోటోలలో పొట్ట కాస్త పెరిగినట్లు కనిపించడంతో, కరీనా గర్భవతి అంటూ పెద్ద ఎత్తున ప్రచారం మొదలైంది. ఈ వార్తలపై కరీనా శనివారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ వేదికగా స్పందించారు.పొట్ట పెరిగినట్లు ఉన్న ఓ వ్యక్తి ఫోటోను షేర్ చేస్తూ, దానికి 'హట్ న బే' అనే క్యాప్షన్‌ను జత చేశారు. దానికి నవ్వుతున్న ఎమోజీలను, పిజ్జా ఎమోజీని జోడించారు. అంతేకాకుండా, 'హమ్ ఆప్కే హై కౌన్' చిత్రంలోని 'చాక్లెట్ లైమ్ జ్యూస్' పాటను బ్యాక్‌గ్రౌండ్‌లో ఉంచారు. తద్వారా తన పొట్ట పెరగడానికి కారణం గర్భం కాదని, పిజ్జా వంటి ఆహారం పదార్థాలేనని ఆమె పరోక్షంగా స్పష్టం చేశారు. గతంలోనూ ఇటువంటి పుకార్లు వచ్చినప్పుడు కరీనా బంధువు సబా పటౌడీ స్పందించారు. కెమెరా యాంగిల్ సరిగ్గా లేకపోవడం వల్లే ఆ ఫోటోలో కరీనా అలా కనిపించారని, ఆమె ఎంతో స్లిమ్‌గా, క్లాసీగా ఉన్నారని వెల్లడించారు. అనవసరమైన ఊహాగానాలకు దూరంగా ఉండాలని ఆమె కోరారు. ఇదివరకు న్యూయార్క్ వెకేషన్ సమయంలోనూ ఇలాంటి రూమర్స్ రాగా, "అదంతా పిజ్జా, వైన్ మహిమ" అంటూ కరీనా వాటిని కొట్టిపారేయడం విశేషం.


# సెప్టెంబరు 1 నుంచి తమిళ సినిమాలు నో రిలీజ్... కారణం ఇదే!

ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో వివాదం

ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలో విడుదల చేయాలని డిమాండ్

నిర్మాతల మండలి కీలక ప్రకటన, షూటింగ్‌లకు ఇబ్బంది లేదు

తమిళ చిత్ర పరిశ్రమలో మరోసారి సంక్షోభం నెలకొంది. ఓటీటీ స్ట్రీమింగ్ నిబంధనలపై థియేటర్ యాజమాన్యాలతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో, 2026 సెప్టెంబర్ 1 నుంచి కొత్త సినిమాల విడుదలను నిలిపివేయాలని తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) కీలక నిర్ణయం తీసుకుంది.ఈ వివాదానికి ప్రధాన కారణం.. థియేటర్లలో విడుదలైన సినిమాలను ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ చేసే కాలపరిమితి. సినిమా విడుదలైన ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలోకి రావాలని థియేటర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సినిమాలు త్వరగా ఓటీటీలో అందుబాటులోకి రావడం వల్ల ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గుతోందని, తద్వారా తమ వ్యాపారం తీవ్రంగా దెబ్బతింటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, నిర్మాతలు మాత్రం తమ వాణిజ్యపరమైన వెసులుబాటును కోరుకుంటున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యే వరకు కొత్త సినిమాలను విడుదల చేయకూడదని నిర్మాతల మండలి స్పష్టం చేసింది. అయితే, ఇది పూర్తిస్థాయి బంద్ కాదని, సినిమా షూటింగ్‌లు, పోస్ట్ ప్రొడక్షన్ పనులు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, తమిళనాడు థియేటర్ యజమానుల సంఘం ప్రతినిధుల మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం సెప్టెంబర్ నెలతో పాటు ఆ తర్వాత విడుదల కావాల్సిన పలు చిత్రాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



# బాలీవుడ్ లో ఏజ్ గ్యాప్ పై మనీషా వ్యాఖ్యలు మరోసారి వైరల్

బాలీవుడ్‌లో హీరో, హీరోయిన్ల మధ్య వయసు అంతరం, మహిళా నటులు ఎదుర్కొంటున్న వివక్షపై సీనియర్ నటి మనీషా కొయిరాలా చేసిన కొన్ని పాత వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ప్రముఖ నటి సిమీ గరేవాల్ నిర్వహించిన 'రెండవూ విత్ సిమీ గరేవాల్' అనే చాట్ షోలో పాల్గొన్నప్పుడు ఆమె ఈ అభిప్రాయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా మనీషా మాట్లాడుతూ.. "ఇది నిజంగా చాలా బాధాకరమైన విషయం. మన పరిశ్రమలో మనవళ్లు, మనవరాళ్లు ఉన్న నటులు కూడా ఇప్పటికీ హీరోలుగా నటిస్తున్నారు. కానీ ఒక నటికి పెళ్లి అయిందంటే చాలు, ఆమెను ఇక సినిమాలకు పనికిరాదన్నట్టు చూస్తారు. హీరో, హీరోయిన్ల మధ్య వయసు అంతరం స్పష్టంగా కనిపిస్తుంది. 40, 50 ఏళ్ల హీరో పక్కన కుర్ర హీరోయిన్ ఎందుకు? 40 ఏళ్లు పైబడిన హీరోయిన్ ఎందుకు ఉండకూడదు?" అని ప్రశ్నించారు.పరిశ్రమలో మహిళలపై ఎన్నో ఆంక్షలు ఉన్నాయని, అయితే కాలక్రమేణా మహిళలు వాటికి వ్యతిరేకంగా పోరాడతారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి సిమీ గరేవాల్ స్పందిస్తూ.. సినిమాల్లో హీరోయిన్లను కేవలం హీరో కోరికలను తీర్చే ఒక వస్తువుగా చూడటం వల్లే ఈ పరిస్థితి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. సిమీ వ్యాఖ్యలపై మనీషా స్పందిస్తూ, "ఒకరిచేత ఆరాధించబడటం మంచి విషయమే. కానీ కేవలం దానికే పరిమితం చేస్తే అది బాధాకరం. ఈ పరిస్థితిని మార్చడానికి మహిళలు కూడా ముందుకు రావాలి. తమ ప్రతిభతో, నటనతో నిరూపించుకోవాలి. నా శరీరాన్ని కాదు, నా పనిని, నా టాలెంట్‌ను చూడండి అని చెప్పగలగాలి. తెలివిగా వ్యవహరించి, ప్రజల దృష్టిని శరీరం నుంచి నటన వైపు మళ్లించాలి" అని వివరించారు. ఈ పాత ఇంటర్వ్యూ ఇప్పుడు మళ్లీ తెరపైకి రావడంతో, చిత్ర పరిశ్రమలో లింగ వివక్షపై చర్చ మరోసారి ఊపందుకుంది.





# నాన్నా.. నువ్వే నా తొలి హీరో: రామ్ చరణ్

మెగాస్టార్ చిరంజీవి శనివారం (ఆగస్టు 22) తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో, ఆయన తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తండ్రికి సోషల్ మీడియా వేదికగా అత్యంత హృద్యమైన రీతిలో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తన జీవితంలో తండ్రి స్థానం ఏమిటో వివరిస్తూ చరణ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది.ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో చరణ్ ఓ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా. మీరే నా మొదటి హీరో, నా అతిపెద్ద స్ఫూర్తి. ప్రతి విషయంలో నేను సంప్రదించేది మిమ్మల్నే. నా జీవితంలోని ప్రతి ఎత్తుపల్లంలో మీ ప్రేమ, మార్గదర్శకత్వం, నాపై మీరు ఉంచిన నమ్మకమే నాకు అతిపెద్ద బలంగా నిలిచాయి. మీరు నా జీవితంలో ఉండటం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. మీకు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషం కలగాలని, మరెన్నో అద్భుతమైన సంవత్సరాలు గడపాలని కోరుకుంటున్నాను. మాటల్లో చెప్పలేనంత ప్రేమతో... నాన్నా" అని రాసుకొచ్చారు. తండ్రిపై తనకున్న ప్రేమను, గౌరవాన్ని రామ్ చరణ్ ఎన్నో సందర్భాల్లో చాటుకున్నారు. తాజాగా ఆయన చేసిన ఈ పోస్ట్ తండ్రీకొడుకుల మధ్య ఉన్న బలమైన అనుబంధాన్ని, తన ఎదుగుదలలో చిరంజీవి పాత్ర ఎంత కీలకమో మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం రామ్ చరణ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మెగా అభిమానులు ఈ పోస్ట్‌ను విస్తృతంగా షేర్ చేస్తూ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

Printed,Published and Owned by : **Konda Narasimha swamy** PRINTED AT : **KOUSALYA PRINTERS ,** H.NO 6-1-948 BOYAWADA STREET, DIST: NALGONGA TELANGANA 508001. RNI NO - **TGTEL/2018/75056.** CELL NO : 7989870511.